# ఎక్కడి మబ్బు- ఎక్కడ వాన ?

ఉన్న ఊళ్ళోనే చరిత్ర పాఠాలు చెప్పుకుంటూ ఉపాధ్యాయుడిగా రిటైర్ అయిన చంద్రశేఖరం దూరప్రయాణాలు చేసి ఎరగడు. తనకున్న ఒక్క కొడుకూ, కోడలూ ఉద్యోగధర్మంగా దేశం నాలుగు దిక్కులా తిరక్క తప్పదు. " ఎదగని ఊరూ, శిథిలమైన కొంపా – అక్కడ ఎవరున్నారని ఒంటరిగా ఉంటారు. మాతోపాటే ఉండరాదూ ? "అంటాడు కొడుకు రామూ . అలాగేలేరా అంటూనే రోజులు కొనసాగిస్తున్నాడు శేఖరం .

అతి కష్టం మీద ఎలాగో తెగించి అహమ్మదాబాద్ వెళ్ళి, నెలరోజులుండి తిరుగు ప్రయాణానికి సిద్ధమౌతున్న సమయంలో " మీ ప్రయాణం ఒక్కవారం రోజుల పాటు వాయిదా వేసుకొండి మామగారూ !" అంది కోడలు నీరజ . చెట్టు క్రింద నీడలో, ఒళ్ళో మనవణ్ణి కూర్చోబెట్టుకుని, దూరంగా పురివిప్పిన నెమలిని చూపిస్తున్న శేఖరం "ఎందుకూ ? " అని ఆశ్చర్యంగా అడిగాడు.

"చలికాలం పోయి వసంతం వచ్చే ముందు రాజస్థాన్ వాళ్ళు జైసల్మేర్‌లో మాఘపౌర్ణమికి పెద్దఎత్తున ఎడారి పండుగ చేసుకుంటారు. మూడురోజులు జరిగే ఈ పండక్కి దేశ విదేశాలనించి జనం వచ్చి చూస్తారు. మీ అబ్బాయికి అక్కడ డ్యూటీకూడా పడింది.మీరు కూడా మాతో వచ్చి చూసి వెళ్ళొచ్చు కదా !" అంది.

ఒక్కక్షణం ఆలోచనలో పడ్డాడు శేఖరం. రాజపుత్రుల గురించి చిన్నతనంలో చరిత్రలో ఎంతో ఉత్సాహంగా చదివాడు. ఉపాధ్యాయుడిగా పాఠాలు కూడా చెప్పాడు. రాజస్థాన్ అనగానే తనమనసులో రాణాసంగ్రామసింహుడూ, రాణాప్రతాపుడూ పృథ్విరాజ్, రాణీ సంయుక్తలూ మెదిలారు.మీసాలూ, తలపాగాలూ కత్తులూ, జ్ఞాపకం వచ్చాయి. అంత సులభంగా కోడలి మాట కాదనలేక పోయాడు. అందుకే "సరే, అల్లాగే" అన్నాడు.

రెండు రోజుల తర్వాత ఒక పేకువనే కారు బాడ్మేర్ దిశగా సాగింది. పరుగుతీస్తున్న ప్రకృతిని కిటికీలోంచి చూస్తున్న శేఖరానికి చిన్నగా నవ్వువచ్చింది. పుష్కలంగా నీడనిచ్చే చెట్లు

దారిపొడుగునా ఉంటాయనుకున్నాడు. తుమ్మచెట్లూ జిల్లేళ్ళూ, ముళ్ళడొంకలూ కనిపిస్తున్నాయేకానీ అవైనా పచ్చగా చిక్కగా లేవు. గుజరాత్ పొలిమేరలు దాటి రాజస్థాన్‌లోంచి కారు సాగుతూవుంటే ఎండవేడి పెరిగింది. ఎదురుగా ఉన్న అద్దంలోంచి చూస్తే దూరాన ఎండ మావులు మెరుస్తున్నాయి. జనసాంద్రత ఎక్కువగా లేని గ్రామాలు అక్కడక్కడ కనుపిస్తున్నాయి. ఏభై గడప ఉన్న గ్రామమైతే అది పెద్దదే అని చెప్పుకోవాలి. పూరిండ్ల పై కప్పులు ఎండు గడ్డితో బొంగరాల తలల్లాగ వర్తులాకారంలో వింతగా మలచుకున్నారు. ఎన్నడూ ఇలాటి వాతావరణం చూసి ఎరగని శేఖరం- పుస్తకాల చదువు వేరు, జీవితాన్ని నేరుగా చదవడం వేరు అనుకున్నాడు.

కాసింత విశ్రాంతికోసం కారు ఆగింది. నాలుగు ఒంటెలు తుమ్మచెట్లకున్న ముళ్ళను ఒడుపుగా తప్పించుకుంటూ నాలుకతో అతి సున్నితంగా చిన్న చిన్న ఆకుల్ని అందుకుని ఇవే మాకు బంగారం అన్నట్లు ఆస్వాదిస్తూ మేస్తున్నాయి. కృష్ణజింకలు, బొచ్చు ఎక్కువగా పెరిగిన మేకలు,నెమళ్ళూ అప్పుడప్పుడు దర్శన మిస్తున్నాయి. చిన్న చిన్న వంతెనలు దాటి కారు ముందుకు సాగుతున్నప్పుడు ఆసక్తితో కిటికీలోంచి క్రిందకి చూశాడు. ఒక్క నీటి బొట్టయినా లేక ఎండిపోయిన వాగుల చాళ్ళు మాత్రం కనిపిస్తున్నాయి.

వింత వింత పద్ధతుల్లో రంగుల తలపాగాలు చుట్టుకుని చెవులకు పోగులు, తమ్మెట్లు పెట్టుకుని శాంతి కాముకుల్లా గ్రామీణులు కనపడ్డప్పుడు ఏమీ పండని ఈ ఎడారిలో ఎలా జీవనం సాగిస్తున్నారో, తివిరి ఇసుమున తైలము తీయగల ఆశావాదమే వీళ్ళది అని కూడా అనుకున్నాడు.

బాడ్‌మేర్ చేరేసరికి మధ్యాహ్నం దాటింది. అది వాణిజ్య కేంద్రం. విస్తీర్ణంలో చిన్నదే అయినా జనం అటూ ఇటూ తిరుగుతూ వీథులు రద్దీగా ఉన్నాయి. అక్కడ ఒక మజిలీ చేసి మర్నాడు వేకువనే జైసల్‌మేర్ బయలుదేరాలని నిశ్చయించుకున్నారు. ఎండవేడి తలకు తగలకుండా చల్లగా ఉంచేందుకు ఒంటె చర్మంతో చేసిన టోపీలు కొనుక్కున్నారు.

దేవీకోట్‌మీదుగా జైసల్‌మేర్ చేరుకునేసరికి ఉదయం పదిగంటలైంది. షహీద్‌పూనమ్‌సింగ్ స్టేడియం పర్యాటకులతో కిట కిటలాడుతూ కోలాహలంగా ఉంది. తండ్రినీ భార్యనీ కొడుకునీ వేడుకలను చూడమని కూర్చోపెట్టి తన పనులేవో చక్కబెట్టు కుందుకు రామూ వెళ్ళిపోయాడు. రాష్ట్ర పర్యాటక శాఖ స్థానిక వాణిజ్య సంస్థల సహకారంతో ఎన్నో పోటీలు నిర్వహించింది.

ఒంటెలే ఎడారిలో వాహనాలైన మధ్యయుగంలో వాటి మీద అంబారీ నిలిపి అలంకరించిన సాంప్రదాయిక మైన దుస్తుల్లో, మేలిముసుగుల్లో రాణులు, శ్రీమంతుల ఇంటి స్త్రీలు ఎలా

విహారయాత్రలు చేసేవారో కళ్ళకు కట్టినట్టు చూపించే పోటీ జరిగింది. పౌరుషానికి ప్రతీకలైన మీసాలు మెలి పెట్టి రంగు రంగుల పగిడీలతో, ఖడ్గాలు చేతబట్టి రసపుత్రవీరులు ఎలా వుండేవారో తెలిపే వస్త్రధారణ పోటీ జరిగింది.

ఎంకీ నాయుడు బావల జంట లాగే రాజస్థానీల జానపద సాహిత్యంలోని జంట-డోలామరూలని జానపదుల ఆహార్యంతో చూపించే పోటీలోయువతీ యువకులు పాల్గొన్నారు. తలపాగాలను అతివేగంగా తలకు చుట్టుకునే నైపుణ్యం ప్రదర్శించే వారికీ, మీసాలు హుందాగా పెంచిన వారికీ పోటీలు జరిగాయి.

అవన్నీ చూస్తున్న శేఖరానికి మధ్యయుగపు రాజపుత్ర జీవన వ్యవస్థ అంతా కళ్ళకు కట్టినట్లయింది.

గంటలు నిమిషాల్లా గడిచిపోయాయి. భోజనవిరామం, విశ్రాంతి తర్వాత నగర మధ్యలో ఉన్న చిన్న చిన్న హస్తకళా ప్రదర్శనలు చూస్తూ సాయంకాలం జరగవలసిన సంగీత నృత్య కార్య క్రమాల కోసం ఎదురు చూస్తూ గడిపేశారు.

ఎదురు చూసిన సాయంత్రం రానే వచ్చింది. పూనమ్‌సింగ్ స్టేడియం మళ్ళీ చైతన్యం పుంజాకుంది. మధ్యాహ్నం ఉన్న ఎండ వేడి సాయంత్రం లేక పోవడంతో, జైసల్మేర్ కోట మీద నుంచి నిండు చంద్ర బింబం వెన్నెల కురిపిస్తూ వుండడంతో చాలా ఆహ్లాదకరంగా పర్యాటకులూ స్థానికులూ కూర్చున్నారు.

జానపదగేయాలు, నృత్యాలు రాజస్థానీ బాణీలో పాడినప్పుడూ ప్రదర్శించినప్పుడూ తరచూ వినిపించే అల్గోజా వాయిద్యం ఎన్నడూ వినని శ్రోతలకి ఎంతో శ్రావ్యంగా ప్రశాంతతను పంచుతోంది.

ఒకే శ్వాసకు స్పందించే – రెండు వేణువుల సమైక్యతతో స్వరప్రస్తారాన్నీ, శృతినీ నడిపించి ఆచల్లని వాతావరణంలో ప్రత్యేకమైన హాయిని కల్గిస్తోంది. బాణాసంచా కాల్పులతో ఆకాశంలో రంగులు పూయించి ఆనాటి కార్యక్రమం ముగించారు.

రెండో రోజు పోలో గ్రౌండ్స్‌లో ఒంటెల మీదనే పోలో ఆట ఆడారు. బంతి వేగానికీ గమనానికీ తగినట్టుగా ఒంటెలు పరుగెట్టి ఆటలో పాల్గొంటూ వుంటే శేఖరం ఉత్సాహంగా చూశాడు. తర్వాత ఎడారి యోధులు పొడుగాటి గుడ్డను తలపాగాగా తలకు చుట్టి ఒంటె మీద

జీను వేసుకుని ఎక్కి జోరుగా పరుగెట్టి లక్ష్యాన్ని ముందుగా చేరాలి. ఆ పందెంలో ఎవడు ముందు వెళ్ళగలుస్తే వాడికి ప్రథమ బహుమతి– దక్కాలి. అయితే చాలా జోరుగా ఒంటెను పరుగెత్తించి మొదటేలక్ష్యాన్ని చేరుకున్న వాడికి ప్రథమ బహుమతి ప్రకటించలేదు.

"ఇదేం అన్యాయం ?" అని అడిగాడు ప్రక్కనే కూర్చున్న కోడలితో.

"అందులో అన్యాయం ఏమీలేదు మామగారూ ! అందరికన్నా ముందుగా ఒంటెను పరిగెత్తిస్తే సరిపోదు. ఎడారి యోధుణ్ణిని చెప్పుకోగల ఆత్మగౌరంతో వెళ్ళ వద్దూ ? మీ అభిమాని ఒంటె మీదే దృష్టి నిలిపి పరిగెత్తించాడు. చివరలో వాడి తలపాగా గాలికెగిరి నేల మీద పడిపోయింది. తలపాగా నేల పాలవడం కన్నా అగౌరవం ఇంకోటుందా రాజపుత్రుడికి ?" అని వివరణఇచ్చింది. శేఖరానికి ఆ జవాబు ఎంతో తృప్తినిచ్చింది. ఆ తర్వాత గడిసర్‌లేక్ అనే వాననీటి మీదనే ఆధారపడ్డ ఒయాసిస్ (నీటిపట్టు) దగ్గర తిరుగుతూ వింతలు చూస్తూ కొంత సేపు గడిపి భోజనాలు ముగించి విశ్రమించారు. అయితే ఆవూరిలో ఎక్కడ తిరిగినా విశ్వరూపంలాగ ఎత్తయిన కొండమీద విస్తరించి ఎండలో బంగారు కోటలా మెరిసిపడుతున్న జైసల్మేర్ దుర్గం అంతా మర్నాడు నిదానంగా చూడాలని నిశ్చయించుకున్నారు.

మూడోరోజు ఉదయాన్నే చంద్రశేఖరం చూడాలని తహతహలాడుతున్న జైసల్మేర్ దుర్గంలోకి, ముఖద్వారం మీద ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహాన్ని చూస్తూ ప్రవేశించాడు.

ఎనభై మీటర్ల ఎత్తుగా ఉన్న త్రికూట పర్వతమని పిలవబడే కొండ మీద పసుపు రంగు సున్నపురాతితో కట్టిన దుర్గం సూర్యకాంతిలో మెరిసిపోతోంది. ఆ కోట ప్రాకారాల మధ్యనే మహారాణా– మహారాణీల నివాసాలు, జైన తీర్థంకరుల మందిరాలు, అంగళ్ళు, సామాన్య జనావాసాలు ఉండేవని చూడగానే తెలుస్తూనే ఉంది.

'జలహీన తరుహీన నిర్వేలమరుభూమి' లాటి ఈ ఎడారిలో ఈ దుర్గం ఎందుకు ? ఇక్కడ ప్రజలు ఏమి పండించుకుని తిన్నారు ? అని వితర్కించుకుంటున్న శేఖరంతో, దగ్గరగానే నడుస్తున్న కర్నాటక నించి వచ్చిన పర్యాటకుడు మాటలు కలిపాడు. తెలుగూ ఇంగ్లీషూ కూడా ధారాళంగా మాట్లాడుతున్నాడు.

శేఖరం తన మనసులోని సందేహాన్ని అతనితో పంచుకున్నాడు. ఆ వృద్ధుడు బాగా దేశమంతా తిరిగిన వాడే. మాటకారి కూడా.

"సముద్రమార్గాలు ఇంకా కనిపెట్టని రోజుల్లో మధ్య ప్రాచ్యం నుంచి సిల్కువస్త్రాలు సుగంధ

ద్రవ్యాలు – అపురూపమైన వస్తువులూ ఒంటెల మీద మన దేశపు పశ్చిమ ప్రాంతానికి చేరాలంటే – ఈ మార్గం ఒక్కటే గతి. ఒంటెల్ని అటకాయించి వర్తకుల నుంచి రాజపుత్రులు పన్ను వసూలు చేసేవారు. అలా వచ్చి పడిన ధనంతో లేని తిండిగింజల్ని ఉన్న చోటి నుంచి తెప్పించుకునేవారు. దేశ దేశాలనుంచి శిల్పులు వాస్తు శాస్త్రంలో నిపుణులు, రాళ్ళుకొట్టేవాళ్ళు వచ్చి తర తరాలుగా నిర్మించిన దుర్గం ఇది. మన దేశం మీదికి వచ్చి పడే దండ యాత్రలను పసికట్టి అడ్డుకోడంలో పన్నెండో శతాబ్ది నుంచి పెద్ద బాధ్యతే నిర్వహించింది" అన్నాడు స్పష్టమైన తెలుగులో. అత్యవసరం అయితే సురక్షితమైన చోటుకి తరిలి పోవడానికి సొరంగం కూడా ఉందని తెలుసుకున్నాక ఒక నాటి జీవన పోరాటంలో ఉన్న కష్టసుఖాల గురించి ఆలోచించి విస్తు పోయాడు శేఖరం.

కోట వెలుపల ఉన్న అందమైన హవేలీలు కూడా చూశారు. సాయంత్రం జైసల్మేర్ నగరానికి సుమారు నలభై కిలోమీటర్ల దూరాన అఖండంగా సముద్రంలా విస్తరించిన పచ్చని ఇసుక బయళ్ల మీద ఒక ప్రదేశంలో ముగింపు రోజు ఉత్సవం ఏర్పాటు చేశారు. సాయంత్రం సూర్యాస్తమయం అవుతున్న వేళ ఇసుక బయళ్ళు కుంకుమ రంగుతో ఘలామా చేసేసుకున్నాయి. గాలిలోని వేడి పోయి చల్లదనం అంతత్వరగా ఎలా చోటుచేసుకుందో శేఖరానికి అర్థంకాలేదు. పిల్లాపెద్దా అన్న తేడాలు లేకుండా అందరూ ఒంటెలెక్కి సవారీ చేస్తూ ఆనందిస్తున్నారు. సూర్యుడు మరుగుపడగానే నిండు చంద్రుడు ఈ సాయంత్రం వేడుకలకి నేనే అధ్యక్షుణ్ణి అన్నట్టు ఆకాశాన కనిపించాడు. చల్లటి పాలవెన్నెల మెల్లమెల్లగా ఇసుక బయళ్ల మీద కుంకుమ రంగుని కడిగి పారేస్తోంది. అంతవరకూ తానుకూడా మరోమారు చిన్న పిల్లాడిగా మారిపోయి మనవణ్ణి తనతో కూర్చుండబెట్టుకుని ఒంటెమీద సవారీచేశాడు. ఎత్తుగా వున్న ఒక ఇసుక తిన్నెమీద విద్యుద్దీపకాంతిలో మిలిగిపోయిన వేదిక నిలిపారు. రాత్రి పదిన్నర వరకూ జానపద నృత్యాలు రాజస్థానీ గ్రామీణ సంగీత బాణీలు కొనసాగాయి. లక్షలాది ప్రజలు చల్లగాలిలో ఆ ప్రదర్శనలు చూస్తూ, వింటూ ఎడారి ఉత్సవానికి ముగింపు చెప్పారు.

మరునాటి ఉదయం తిరుగు ప్రయాణానికి అంతా సిద్ధమైపోయారు. వాళ్ల తోపాటూ వచ్చిన మల్లప్ప కారు తుడిచి, ఇంధనం పోయించి తీసుకొచ్చాడు. రామూ స్టీరింగ్ పట్టుకున్నాడు. జరిగిన మూడు రోజాల ఉత్సవాలు గురించి ముచ్చటించు కుంటూ తిరుగు దారి పట్టారు.

చంద్రశేఖరం ప్రశాంతంగా కూర్చున్నాడు. ఏవో వింత ఆలోచనలు మెదలుతున్నాయి. ఎక్కడి రఘునాథపురం – ఎక్కడి జైసల్మేర్ ? పుస్తకాలుఅందివ్వలేని కొత్త ప్రపంచాన్ని చూసినట్టనిపించింది. ఎన్ని భాషలు ? ఎన్ని జీవన విధానాలు ? దేవీకోట్ దాటిన తర్వాత కాబోలు

గుంగా అనే చిన్న గ్రామం దగ్గర రాముూ కారుని ఆపేసాడు. 'మల్లప్పా ! చక్రం మార్చక తప్పదు. ఫటాఫట్ కానియ్యి... అంటున్నాడు, వెనకనే కూర్చున్న సహాయకుని పిలిచి.

అందరూ కారుదిగి బయట రోడ్డుకి ఒక ప్రక్కగా నిలబడ్డారు. ఈ గ్రామ మేదో కాసింత పచ్చగా ఉందే అనుకున్నాడు శేఖరం. కొత్తగా కనపడ్డ వాళ్ళని చూడ్డానికి గ్రామంలోంచి ఇద్దరు పిల్లలు వచ్చారు. వింతగా చూస్తూ నిలబడ్డారు.

నీరజ కల్పించుకుని పేరేమిటని వాళ్ళని హిందీలో అడిగింది.

"నా పేరు కిషన్ కుమార్, మాతమ్ముడు పేరు పూనమ్ అన్నాడు ఆ ఇద్దరిలో కాసింత పెద్దవాడు.

"మీ నాయన ఏం చేస్తూవుంటారు ?"

"ఖేత్ బాడీ"

"ఏం పండిస్తారు ? "

"బాజరా, గవార్ పల్లీ "

"ఇంట్లో ఏ భాష మాట్లాడతారు ?"

"రాజస్థానీ......"

"ఖేత్‌బాడీ – ఎవరు చేస్తారు ..?"

"మా నాయన, మా దాదా?"

"ఇక్కడపిల్లలకిహిందీ కూడా వస్తుందా ?" అని ఉత్సాహంగా అడిగాడు శేఖరం తెలుగులో.

"ఎందుకురాదూ ? రాజస్థాన్‌కి మిగతా చోట్లనించి వచ్చేవాళ్ళు హిందీ ఎక్కువగా మాట్లాడతారు కదా !"

కోడలూ మామా మాట్లాడు కొంటూ వుంటే – విని,

"మీరు తెలుగు భాష కదా మాట్లాడుతున్నారు ?" అని అడిగాడు ఎనిమిదేళ్ళ కిషన్ కుమార్.

"మాభాష తెలుగని ఎలా పోల్చావ్ ?" అని హిందీలో ఎంతో ఆశ్చర్యంగా అడిగింది నీరజ.

"ఇక్కడికి తెలుగు భాష మాట్లాడేవారెవరు వచ్చినా తెలుగులోనే మాట్లాడతాడు మా దాదా" అన్నాడు ఆ కుర్రాడు. ఆశ్చర్యం ఇనుమడించింది. ఇంతలో వాడి తమ్ముడు పరుగున వెళ్ళి ఒక వృద్ధుణ్ణి చేయ్యిపట్టుకుని లాక్కువచ్చాడు. తలమీది ఎర్రని పాగాను సవరించుకుంటూ పండిన మీసం గడ్డంతో వచ్చిన వృద్ధుడు "మీది తెలుగుదేశమా ?" అని ప్రశ్నించాడు వినయంగా.

"మేం అహమ్మదాబాద్‌లో ఉంటాం. మరూసమారోహకి వచ్చాం. వీరు మామామగారు– శ్రీకాకుళం జిల్లా అని నీరజ పరిచయం చేసింది. తెలుగు ప్రశ్నకు తెలుగులోనే సమాధానం చేస్తూ.

"శ్రీకాకుళం జిల్లాలో ఎక్కడ ? అని అడిగాడు వృద్ధుడు

"రఘునాధపురం – టెక్కలి ..."

ఎదుటికి ఎంతో ఉత్కంఠతో వచ్చి కళ్ళలోకి చూస్తున్న ఆవృద్ధుడి నుదుటి మీద గచ్చకాయంత పెద్ద నల్లని పుట్టు మచ్చవేపు చిత్రంగా చూస్తున్నాడు శేఖరం.ఒక్క నిముషం కాల చక్రం ఆగి వెనుక్కి తిరిగి నంత పనైంది. ఆ ఇద్దరినీ మిగిలిన వాళ్ళంతా మాట లేకుండా చూస్తున్నారు.

"సుబ్బన్నా ! ఇది కలా నిజమా ?" శేఖరమే నోరు మెదిపాడు. గాలి పారే అంతజాగా అయినా విడవకుండా వృద్ధులు కౌగిలించుకుని కళ్ళ తడి పెట్టుకున్నారు.

సుబ్బన్న ఆత్మీయంగా అందరినీ ఇంటికి తీసుకు వెళ్ళాడు. ఆవాడలో తీరిగ్గా ఇళ్ళముందు మాట్లాడుకుంటున్న తలపాగా మనుష్యులంతా వీళ్ళని చూసి గౌరవసూచకంగా నిలబడ్డారు– సుబ్బన్నకు అక్కడ ఉన్న పరపతి, పలుకుబడి తక్కువ కాదని తెలుసుకున్నారు. పరస్పర పరిచయాలు పూర్తి అయిన తర్వాత చిన్న నాటి స్నేహితుడితో క్లుప్తంగా తన కథ చెప్పుకున్నాడు సుబ్బన్న.

"మీ అరుగు మీద ప్రైవేటు మాష్టరు పాఠం చెప్తూవుంటే నేను వింటున్నప్పుడు నా సవతి తల్లి వచ్చి గొర గొర ఈడ్చుకు పోయింది. నౌకరీకి పొమ్మంటే చదువుతానని ఇక్కడున్నావ్ అని అట్లకాడ కాల్చి అరచేతి మీద పెట్టింది. ఆ సాయంత్రం నౌపడా పోయి హౌరామైలెక్కేశాను. ఆ తర్వాత నేను ఎక్కని రైలు బండి లేదు, ఎరగని ప్లాట్‌ఫారమ్ లేదు. ఆకలి వేస్తే అడుక్కుంటూ, చిన్న చిన్న బరువులు మోసి ప్రయాణీకులు ఇచ్చిందే తీసుకుంటూ, కొన్నాళ్ళకి ఢిల్లీ చేరుకున్నాను.ఆ బ్రతుకులో లైసెన్స్ కూలీలు రెండు సార్లు నన్ను బాగా కొట్టి దండించారు.కొన్నాళ్లు ఒక సత్రంలో పనికి చేరాను.ఢిల్లీలో ఏదో కిసాన్ మేలాకి రావల్ అన్న రాజస్థానీ రైతు వచ్చాడు. మరి నేనంటే ఎందుకు అభిమానం కల్గిందో కానీ నా కథ విన్నాడు.

'నాకు పిల్లలు లేరు భార్యకు అనారోగ్యం.' ఏదో కాస్త భూమి వుంది. నాతోరా – అని ప్రేమగా పిలిచాడు. చిన్నతనం నుంచీ ప్రేమ ఎరగని దురదృష్టం నాది. కపటం లేకుండా అలా పిలిచేసరికి కాదనక అతనితో వచ్చేశాను. వాళ్ళ ఉప్పుతిన్నాను. భాష మాట్లాడాను. భూమి మీద పని చేశాను. రావల్ భార్య నన్ను కన్న సంతానంలా అభిమానంతో చూసుకుంది. వాళ్ళు చూసిన పిల్లని పెళ్ళి చేసుకున్నాను– వాళ్ళు గతించినా ఇక్కడే వేళ్ళు తన్ని మొక్కలా నిలిచి పోయాను– వీళ్ళు ఇద్దరూ నా మనవలు. ఇప్పుడే నా కొడుకు దేవీకోట్‌కి ఏదో పనిమీద వెళ్ళాడు" అంటూ

ఆవేశంతో చెప్పుకోవడం వల్ల కలిగిన ఆయాసంతో దీర్ఘంగా నిట్టూర్చాడు సుబ్బన్న.

"పిల్లలు లేని దంపతులు నిన్ను అభిమానించడం సబబే కానీ ఇక్కడ గ్రామస్థులు నిన్ను సులభంగా స్వీకరించడం కూడా వింతే సుమా !" అన్నాడు చంద్రశేఖరం ఆశ్చర్యంగా.

"నీటికి కొరత ఉన్న ఈ గ్రామాల్లోని మనుష్యుల గుండెల్లో తడికి కొరత లేదు - శేఖరం! మొదట్లో ఇక్కడ ఎండిన చెరువూ పండని భూమీ చూసి ఎలా బ్రతుకుతున్నారు వీళ్ళు ? అనుకునేవాణ్ణి. మా పొలానికి నీరు అందించే చిన్న చెరువు కాస్తా ఎండి అడుగు నేల బీటలు వారింది. అక్కడెక్కడో గనుల త్రవ్వకం వల్ల ఇలా భూమి అడుగు నీరు అటు దారి మళ్ళిందన్నారు-కొందరు.

ఒకమారు పదిమంది యువకుల్ని పోగుచేసి, అందరం రెండు నెలలు శ్రమపడి చెరువుని లోతు చేశాం. అడుగున చెత్తనీ పూడిక తీశాం. మా ప్రక్క గ్రామం వాళ్ళు కూడా వచ్చి అదనంగా సహాయం చేశారు. ఊట నీరు నిలిచింది. ఆశ చిగిర్చింది. ఇంకాస్త కష్టపడ్డాం. వాన పడేరోజుల్లో ఎత్తు ప్రదేశాల్లో కురిసిన నీటిని ఊరికే పోనీకుండా చెరువులోకి మళ్లించాం. గ్రామంలోని బావుల్లో నీరు కనిపించింది. గడ్డీ గాదరా కాసింతమొలచి పశువులకి మేత దొరికింది. గ్రామంలో పచ్చదనం కనిపించగానే పట్నాలకు వలసపోవాలనుకునే యువత ఇలాటి కార్యక్రమాలు చుట్టూవున్న గ్రామాల్లో కూడా చేత బట్టి వలసపోవడం మానుకున్నారు. అలా అంతా కలిసి శ్రమ పడ్డంలో ఏదో మంత్ర శక్తి ఉంది శేఖరం. అలానే పడ్డ శ్రమతో నా చెమటతో పరాయితనం అంతా కడిగేసుకున్నానో ఏమో, నన్ను పూర్తిగా ఇక్కడి ప్రజలు వాళ్ళలో ఒకడిగా స్వీకరించారు. సుబ్బన్నా అని ఇక్కడ పలకడం అలవాటు లేక సోబన్, శోభన్ అని నన్ను పిలిచేవాళ్ళు. కొన్నాళ్ళకి ఎవడో సింగ్ అని కూడా తగిలించి నన్ను శోభన్‌సింగ్‌ని చేసేశాడు. అలా క్రమంగా ఈ గ్రామానికీ ఈ మట్టికీ అలవాటు పడి అతుక్కుపోయాను. అసలు నాకు ఎవరున్నారని ? ఎక్కడికి పోను ? నాకే ఇదంతా ఆశ్చర్యంగా ఉంటుంది శేఖరం !" అన్నాడు కళ్ళు తుడుచుకుంటున్న సుబ్బన్న.

మల్లప్ప కారుకి చక్రం బిగించి ప్రయాణానికి సిద్ధం చెయ్యడంతో ఇక వీడ్కోలు చెప్పే సమయం వచ్చింది. సుబ్బన్న మనవల జేబులనిండా బిస్కట్లూ చాక్‌లేట్లూ పోసి నింపింది నీరజ.

కాలచక్రంలా కారు శబ్దం చేస్తూ కదలి పోయింది. శేఖరం పదినిముషాల వరకూ మాటామంతీ లేకుండా అంతర్ముఖంగా దృష్టినిలిపినట్టు ఉండిపోయాడు.

సుబ్బన్న తనతో పాటూ ఎనిమిదో క్లాసు చదువుతూ స్కూలు మానేయడం, అతని తండ్రి

పొలంలో పాము కరిచి చనిపోవడం, సవతి తల్లి రోజూ సుబ్బన్నని ఏదో కారణంగా హింసించడం – అన్నీ కళ్ళ ఎదుట కదలినంత స్పష్టంగా మనసులో మెదిలాయి.

వాస్తవం ఒక్కొక్కసారి కల్పన కంటే ఆశ్చర్యంగా ఉంటుందని ఎన్నడో చదివిన వాక్యం మననం చేసుకున్నాడు శేఖరం. రెండు కళ్లూ చెమ్మగిల్లాయి.

ఎక్కడి మబ్బు ఎక్కడ వర్షించాలో – అది కేవలం ప్రకృతి సంకల్పం అని గాఢంగా నిట్టూర్చాడు.